కథానిక

# తొలి చూలు

పి. సరళాదేవి

అప్పుడే స్నానం చేసివచ్చి నిలువుటద్దం ముందు నుంచుని మొగానికి పౌడరద్ది కుంకం దిద్దుతోంది సుశీల. ఇంతలో పక్కింటి పిన్నిగారు రివ్వున ఇంట్లోకివచ్చి—

''ఏమే సుశీ! నీళ్ళోసుకున్నావటగా?'' అనగానే-

''అవును పిన్నిగారూ! అయితే నేను నీళ్ళు పోసుకుంటున్నప్పుడు తలుపు తట్టింది మీరే నన్నమాట'' అంది అమాయకంగా.

''ఓసి నీ యిల్లు బంగారంగాను! ఇరవైఏళ్ళు మింగావు-ఇంకా అర్థంచేసుకోలేవుటే!'' అంటూ బుగ్గలు నొక్కుకుంది పిన్నిగారు. సుశీల అర్థం చేసుకున్న వెంటనే సిగ్గుతో తల తిప్పేసింది.

''అయితే ఎన్నోనెలే....''

''మూడోనెల''

''అవునే! మూడో నెలొచ్చినా, పొరుగున్న పిన్నమ్మ సంతోషిస్తుంది, చెబుదామన్నమాట లేదుకదా! వచ్చిన దగ్గరనించి కూతురిలా కళ్ళల్లో పెట్టుకున్నాను కదా....మా అబ్బాయికి మీ ఆయన చెప్పారట-వాడొచ్చి అంటే వరు గెత్తు కొచ్చాను.''

''లేదమ్మా! సిగ్గు....'' తమాయించుకున్న సిగ్గు ముంచుకొచ్చింది.

''నీ సిగ్గు సంతకెళ్ళా! పిన్నిగారి దగ్గర సిగ్గేవిఁటే? పోనీ ఇప్పటికయినా తెలిసింది. ఒళ్లు జాగ్రత్త సుమా....'' అని హెచ్చరించి వెళ్ళిపోయింది.

ఆరు నెలల్లో తను మాతృశ్రీ కాబోతోంది. అరే!\ అప్పుడే! మొన్నటివరకూ తను వెన్నెల్లో దొంగాటలాడి వుయ్యాల లూగుతుండేదే! ఆ చంద్రకాంతను తను తప్ప ఇంకెవరైనా పట్ట గలిగే వాళ్ళా? అసలు మొన్నమొన్నటివరకూ దేనికో ఓ దానికి అమ్మని అల్లరి పెడుతూనే ఉండేదికదా- అప్పుడే ఆ భాధ్యత తనమీద పడబోతోందే! అమ్మో! ఆ కృష్ణవేణుందే వుడి కించి చంపేస్తుంది. ఇప్పుడు ముగ్గురేమో! ఆ సీత కసలు పెళ్ళేకాలేదు. వాళ్ళందర్నీ అలా ఒదిలేయగా ఒక జట్టు వాళ్ళయిన మా ముగ్గురి లోనే ఇంత భేదం.

ఎదురింట్లో పాప కేర్ మనగానే త్రుళ్ళి పడింది సుశీల. నవ్వుకుంది. ఇంకొక్కమూణ్ణెల్లు కళ్ళు మూసుకుంటే ఈ ఇంట్లోంచీ అలాగే ఏడుపు వినిపిస్తుంది కదూ....? గదిలో ఉయ్యాల కట్టావేమో!....తనప్పుడే....అమ్మో! కొత్త అనుభూతితో సతమతమయిపోయింది.

తెలిసిన వాళ్లయినా పదేపదే అడుగు తూండడమూ, ఈమె మొదట్లో సిగ్గుపడుతో చెప్పి చెప్పి తరువాత మామూలయి పోవ డమూ, మామూలయి పోయింది.

అందరికీ తెలిసిపోయింది. ఏదో ప్రత్యేకంగా చూస్తారు. ఆ చూపుల్ని తప్పించుకోవాలని బలేఅవస్థ పడుతోంది సుశీల.

స్నేహితురాలు వరలక్ష్మి వచ్చి మూట్లా డుతూ చటుక్కున ''అది నిజమేనా?'' అంది ఆమె గర్భంవైపుచూస్తో. అలవాటయిందేమో అర్థంకాక తబ్బిబ్బు పడలేదు. నిజమేనన్నట్లు తలవూపింది. ''పోనీలే కాలక్షేపం బాగా అవు తుంది'' అనేసి నవ్వేసింది వరలక్ష్మి. అంత తేలిగ్గా అనేసినందుకు ఒక రకంగా బాధ పడింది సుశీల.

ఓరోజు పుట్టినరోజు పేరంటానికి వెళ్ళవల సొచ్చింది సుశీల. అక్కడ పిల్లలందరూ కేరిం తాలు కొడుతున్నారు. అలంకరించి వున్న పుట్టినరోజు పాప ఠీవిగా నవ్వుతూ కుర్చీలో కూర్చుంది.

అక్కడ రెండే రెండు పార్టీలు కనిపిం చాయి. పెళ్ళికాని పిల్లలు, పిల్లల తల్లులు. పిల్లల తల్లులందరూ కూర్చున్న ప్రక్కకు వెళ్లి

కూర్చుంది సుశీల.

ఒకామె తన చిన్నారికొడుక్కి • పాలిస్తోంది. తనూ కొన్నాళ్లు పోయాక అలా....అమ్మో! ఎలా?....అంద రెదురుగా....చటుక్కున కళ్లు తిప్పుకుంది.

ఓపాప అమ్మవళ్ళోకూర్చుని దేనికో మారాం చేస్తోంది.

"తప్పుకదూ పాపా! అలా అల్లరి చేయొచ్చునా" అని అమ్మ ఎంత చెబుతున్నా వినలేదు పాప.

"అలా అల్లరిచేస్తూండు, రేపు ఆటకుపంపకుండా ఎండలో నిలబెట్తా, అక్కడికి తిక్క కుదురుతుంది" అని అనేసరికి చప్పున నోరు మూసుకుంది పాప. నవ్వుకుంది సుశీల.

సంవత్సరం పిల్లాడిని చంకనేసుకొని, పట్టు చీర గరగరలాడిస్తూ వస్తూన్న ఏదో దూరపు స్నేహితురాలని తనుఅనుకొంటూన్న ఆవిడను చూచి-

"ఎన్నాళ్ళికెన్నాళ్ళికి!" అంది సుశీల.

ఆవిడ వచ్చి సుశీల పక్కనే కూర్చుంటూ- "మీకేం మీరలాగే అంటారు. పిల్లలుగలవాళ్లిం ఎక్కడికి కదలగలము?" అంది.

"ఓయబ్బ! ఒక్క కొడుక్కే పిల్లలుగల వాళ్ళం!" అంది పకపక నవ్వుతూ సుశీల.

"ఒక్కడయితేనేం? ఎక్కడికైనా వెళ్లామంటే చచ్చేచావు! వీడిని ఎత్తుకొని తిప్పుతూ తిరుగుతాను. పోనీ ఇంట్లో చూచేవాళ్లయినా ఎవరూ లేరు. చస్తున్నా ననుకో! హాయిగా పెళ్ళయిన ఐదేళ్లవరకూ పిల్లలు పుట్టకూడదు- జల్సాగా తిరిగేయవచ్చు. నీ పనే హాయి!"అంది ఒక్కుమ్మడిని.

సుశీల నవ్వింది.

"అవిదేమీ వూరికే లేదండీ! వచ్చే పుట్టిన పండక్కి మీలాగే వస్తుంది" అని ఓ పిల్లలతల్లి అందుకునేసరికి—

"ఆఁ అప్పుడే!" అని ఆశ్చర్యపోయి— "పెళ్లయి ఎన్నాళ్ళయిందేవిఁటి?" అడిగింది.

"ఆరునెలలు" అంటూ మెల్లిగా చెప్పింది సుశీల.

"పెళ్ళయిన ఏడాదికి పిల్ల నెత్తుకోవడమే ఇప్పుడు ఫేషనమ్మా!" అందింకో ఆవిడ.

"శుభమా అని తొలు చూలయితే పిల్లంటా వేమిటమ్మా! వంశోద్ధారకు డనకుండా" అంది అప్పుడే లోపలికొస్తున్న పిన్నిగారు. వీళ్ళ మాటలమధ్య సుశీల నలిగిపోయింది.

పుట్టిన పండుగ పాపకి హారతిచ్చి అందరికీ సెనగలు పంచుతూ "మా సుశీల యింట్లో లడ్డూ లందుకుందాం కాని ఇప్పటి కివి తీసుకోండి" అందా గృహిణి నవ్వుతూ. సుశీల బయటికొచ్చాక కాని వూపిరితీసుకోకపోయింది.

* * *

ఐదవనెల వచ్చింది. సాయంత్రం కాళ్ళు చేతులు మొగం కడుక్కుని వచ్చి, అద్దం ముందు నించున అలంకరణలో పడింది. భర్త భాస్కరం ఆమెను తదేక దృష్టితో చూస్తూ "సుశీ" అన్నాడు. ఏమిటన్నట్లు చూచింది సుశీ.

"నీకా చిన్ని పొట్ట వింత శోభ నిస్తోంది సుశీ!" ఆమె మొగం కందగడ్డయింది. త్వరగా ముగించేసి వచ్చి కూర్చుంది. ఏం మాట్లాడడానికి తోచలేదు. అతని ప్రక్క చూడడానికి మొగం చెల్లలేదు. అలా కేలండర్లవీ చూస్తూ చూస్తూ ఒక కేలండరుమీద దృష్టి నిలిపింది.

అది ఒకబ్బాయి బుల్లి చేతుల్తో గ్లాసెత్తి పాలు తాగుతున్నట్టున్న కేలండరు. ఎర్రగా, బొద్దుగా వున్నాడు. లక్షణంగా కూర్చొని ఎంచక్కా పాలు తాగుతున్నాడు. భాస్కరం ఆమె దృష్టిని పరికించాడు.

"సుశీ" ఆమె చూచింది.

ఓ న్యూసు పేపరులో బిస్కట్లు తింటోన్న పాపని చూపిస్తూ "ఇది బావుందా, అది బావుందా" అంటూ కేలండర్ చూపించాడు. ఆమె గ్రహించేసింది.

"అదే బావుంది" అంది కేలండరు చూపిస్తూ.

"ఊహూ ఇదే బావుంది" అన్నాడు మారాం చేస్తున్నట్టు.

"బావుంది. మీకిది బావుంటే, నాకది బావుంది!" నవ్వేసింది.

"వీల్లేదు ఇదే."

"అహ అదే."

"ఇదే."

"ఇదే" అనేసి—

"అంతంత కట్నాలిచ్చి పెళ్ళి చేయలేరు" అంది.

"అంతంత డబ్బు పోసి పెద్ద చదువులు చదివించలేవు."

"అబ్బ! నాకదే కావాలి...."

"కాదు ఇదే కావాలి...."

"అదే, అదే, అదే...."

"అయితే ఏదో ఒక వేలు పట్టుకో" అంటూ రెండు వేళ్ళు ముందుకి చాచాడు. ఒక వేలు పట్టుకుంది.

"ఆఁ ఆఁ ఇదే ఇదే" అంటూ చప్పట్లు కొట్టేశాడు.

"ఊఁ మీరు మార్చేశారు. నే నొప్పుకోను."

"పిచ్చి సుశీ! నీ యిష్టం నా యిష్టమేమిటి మధ్య" ఆమె బుగ్గమీద చిటికెవేసి నవ్వేశాడు. ఆమె నవ్వేసింది. ఇంతలో ఆయన స్నేహితుడు వస్తే లోపలికి వెళ్ళిపోయింది.

"ఏంరోయి తండ్రివి కాబోతున్నావట."

"కాకుండా ఎన్నాళ్ళుండమంటావురా?"

"ఎన్నాళ్ళేనా? ఏడాదైనా వుంటే బావుండును."

"ఏడాది తరువాత వచ్చేదేదో ఇప్పుడే వచ్చేసింది. అంతేకదూ!" అన్నాడు. ఇది వింటున్న సుశీలకి చెడ్డ సిగ్గేసింది.

అందరూ అడగడమే! తననే అలా అడుగుతారా? లేకపోతే తన స్థితిలో వుండేవాళ్ళందరినీ అలాగే అడుగుతారా? సాధారణమైపోతున్నా వింతే వీళ్ళకి.

ఆమెకి వీధిలోకి రావాలంటే భయముగా వుంది. తెలిసినవాళ్ళు, తెలియనివాళ్ళు అందరూ అడుగుతూండడం. ఎప్పుడైనా తప్పిజారి అలా తిరిగివద్దామని సాయంత్రంవేళ బయలుతుందా—రోడ్డుమీద అందరూ వింతగా చూస్తుంటారు. ఆయనపక్క నడవడానికి సిగ్గు. సినిమాకి వెళ్ళినా అంతే గొడవ! ఎత్తుగావచ్చిన పొట్టను చూస్తో, ఇద్దరివక్కా వింతగా చూపులు తిప్పేసి, వాళ్ళల్లో ఒకర్ని చూసి ఒకరు నవ్వేసుకుంటారు. ఒకరు తప్పితే ఇంకోరు యిలా ఆ చూపులు తప్పించుకోవడము బ్రహ్మాండము!

అదీగాక ఓసారి ఆమె భాస్కరంతో సినిమాకి వెళ్తోంటే—ఓ తెలిసిన మొగం అసలు తెలియని మొగంతో "చూడవే! ఆ సుశీల, కడుపుతో మొగుడివక్కని నడవడానికైనా సిగ్గు లేదు కాబోలు" అని అంటోన్న మాటలు చెవినిబడి మనసు చివుక్కుమంది సుశీలకి. అప్పటినించి ఆమె భర్తతో ఎక్కడికి వెళ్ళడం మానేసింది. అసలు వీధిలోకైనా తరచుగా రావడం మానేసింది.

తను 'అమ్మ' కాబోతోందని, చదువుకున్నప్పటి స్నేహితురాలికి లేఖ వ్రాస్తే—"అదృష్టవంతురాలివి. ఒక లక్ష్యమంటూ ఏర్పడింది నీకు. దాని ఆధారంతో జీవితం సులభంగా నడుస్తుంది, అబ్బాయో, అమ్మాయో వ్రాయి. వీలు చూసుకొని అప్పుడోసారి వస్తాను" అని జవాబు వ్రాసింది.

అది చదివేసేసరికి మహలావు గర్వం కలిగించింది సుశీలకి. ఎన్నోఏళ్లు ముంచుకొచ్చేసినట్టనిపించింది. తనెంతో పెద్దదయిపోయినట్టు, తనమీద ఎంతో బాధ్యతవున్నట్టు ఫీలయింది.

తను 'అమ్మ' అమ్మా అమ్మా అని చిన్ని పెదవులతో పిల్చే పసిపాప వస్తాడు. తప్పటడుగులతో ఇల్లంతా కలయదిరుగుతూ, అన్నీ చిందరవందర చేస్తూ, బోసినోటితో నవ్వుతూ.

ఒక్కుమ్మడిని సంతోషాలన్నీ వచ్చి మీద పడినట్టు ఉక్కిరిబిక్కి రయింది. అద్దంలో చూసుకొంది. ఎత్తుగావచ్చిన పొట్ట. అందులో తన పాపడు తిరుగుతున్నాడు. "నీకా చిన్ని పొట్ట వింతశోభ నిస్తోంది సుశీ!" అన్న భర్త మాటలు జ్ఞాపకం వచ్చాయి. హృదయం ఉప్పొంగి పోయింది.

"....అల్లరీ చేయదండీ
మాబాబు
గిల్లినా ఏడ్వదండీ...."

అని సినిమాపాట పాడుకొని హాయిగా నవ్వుకొంది. ఆ సంతోషం లోపల, ఇముడక వడక కుర్చీలో కూర్చుని తదేకదృష్టితో కేలండర్ని

చూస్తోంటే చిరునవ్వు రూపంలో వెలువడు తోంది. భాస్కరం వచ్చాడు. ఆమె గమనించ లేదు. మెల్లగావచ్చి ఆమె మొగాన్ని తనవైపు త్రిప్పకొని—

"అమ్మగారి మనసుని అబ్బాయిగారు లాక్కున్నట్టుందే!" అన్నాడునవ్వుతూ. అతని చేతిని అలాగే లెంపకాయ నించుకుంది. ఆనందంతో కనురెప్పలు మూతలుబడ్డాయి.

"అమ్మగారి మనసుని అబ్బాయిగారు లాక్కుంటే—ఆశాభంగం పొందగలవు సుశీ!" అన్నాడు ఆమె జుత్తు సవరిస్తో.

"ఛా వూరుకోండి. మీమాట తరువాత చూసుకోవచ్చు గాని, ముందు నామాట నెగ్గనివ్వండి!" అంది గారాబంగా.

"పోనీలే. అలాగే అనుకో! అంత ఆశపెట్టుకొన్నావాయె...."అంటూ కళ్లుతిప్పి నవ్వాడు. ఆమె కిలకిలా నవ్వేసి "గడుసువారే!" అంటూ కాఫీ తేవడానికి వెళ్ళింది.

♦ ♦ ♦

"ఏమే సుశీ! అన్నం తిన్నావా?" అంటూ వచ్చింది పిన్నిగారు.

"లేదండీ పిన్నిగారూ! ఆయనింకా రాలేదని...."

"బావుందేవే! ఆయన రాలేదని కాచుకున్నావా? వట్టి మనిషివా ఏమన్నానా? పద, పద. వేళకింత తినకపోతే వళ్ళేమవుతుందనుకున్నావ్?" అని ఆమె తినేవరకూ వెళ్ళనని కూర్చుంది పిన్నిగారు. అదేదో పూర్తిచేసి, పిన్నిగారి కింత వక్కపొడి ఇచ్చి తనింత వక్కపొడి వేసుకుంటూంటే వీధిలో బండాగిన శబ్దమయింది. బండిలోంచి దిగిన అమ్మనుచూసి పొంగిపోయింది సుశీల.

"ఏమమ్మా! వచ్చారా?" పలకరించింది పిన్నిగారు.

"ఏడవనెల వచ్చింది తీసుకుపోదామని వచ్చానమ్మా!" అంది అమ్మ

"అవునమ్మా! తీసుకుపోవడమే మంచిది. ఇక్కడుంటే వేళపట్టున తిండికూడా తినదు. ఆయన రాలేదంటూ కూర్చుంటుంది" అంటూ పిన్నిగారు ఏకరువు పెట్టేసింది.

అమ్మవచ్చిన దగ్గర్నించీ ఆయన్ని వదిలి అన్నాళ్ళుండాలే అని దిగులు, పాపని తలచుకుంటే సంతోషం. రెండింటితో సతమతమైంది.

ఓరోజు ప్రయాణమయారు. వెళ్ళేముందు గదిలోకి పిల్చి "సుశీ! ఆరోగ్యం జాగ్రత్త సుమా!" అన్నాడు భాస్కరం. ఆమెకి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"నేను లేను కదా అని ఇంటికి రాకుండా తిరిగి తిరిగి ఆరోగ్యాన్ని పాడుచేసుకోకండి" అంటూంటే గొంతు పూడ్చుకుపోయి, కళ్ళంట నీళ్లు కారిపోయాయి.

"ఛాఛా ఏడుస్తావేం సుశీ! ఐదు నెలలోపికపడితే పాప నెత్తుకుని వస్తావు. ఇక్కడిలా వుంటావు గాని పాప గొడవలోపడి నన్ను మరచిపోతావులే" అన్నాడు కన్నీరు తుడుస్తూ.

అతని హృదయంమీద తలపెట్టి "వెళ్లొస్తానండీ!" అంది.

"క్షేమంగా వెళ్లి లాభంగా రా....నీకోసం.... అహ పాప కోసం ఎదురుచూస్తుంటా" ఆమె నుదుటిని లాలనగా చుంబించాడు.

ఆమె పుట్టింట్లో అడుగు పెట్టేవరకూ తహతహ లాడిపోయింది. దారి పొడుగునా అడగడమే! "ఎన్నో నెలమ్మా?" "తొలి చూలు కాన్పా" అని. వాళ్ళందరికీ జవాబు చెప్పేసరికి తలప్రాణం తోక కొచ్చింది. "వట్టిమనిషి కాదు" అంటూ ఎంత ఇరకాటంగా వున్నా ఆమెకి స్థలం ఇచ్చేసేవారు. ఇద్దరు ముగ్గురయితే వాళ్లు తింటూన్నది ఈమెకి కూడా తినమని ఇచ్చారు. తననలా ప్రత్యేకంగా చూస్తూంటే ఆమె సిగ్గుపడిపోయేది.

పుట్టింటి కొచ్చిన తరువాత బంధువులూ, స్నేహితుల రాకపోకలు, కవ్వించి నవ్వించడాలూ, చిన్ననాటి స్నేహాలతో ఉల్లాసంగా రెండు నెలలు గడిచిపోయాయి.

♦ ♦ ♦

ఓ శుభ ముహూర్తాన దోసపండంటి అబ్బాయి పుట్టాడు. పొత్తిళ్ళలో హాయిగా నిద్రపోతున్న అబ్బాయిని చూస్తో, భర్తని తలచుకుని తన మాటే నెగ్గినందుకు తృప్తిగా నవ్వుకుంది సుశీల. ★